సీపీఎం మహాసభలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సత్యం

బాలానగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రగతినగర్‌లో జరిగే సీపీఎం జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. బాలానగర్ శ్రీశ్రీనగరంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ.. ప్రగతినగర్ మహా సభలకు కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు వెంకటరామయ్య, ఇలాపురం రాజశేఖర్, లక్ష్మణ్, శంకర్, నరేష్, లింగస్వామి, విజయ, శివప్రసాద్, చైతన్య పాల్గొన్నారు.

బీజేపీ కూకట్‌పల్లి ఓబీసీ ఇన్‌చార్జిగా కృష్ణగౌడ్



మాజీ కార్పొరేటర్ ముద్దాపురం కృష్ణగౌడ్‌ను అభినందిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఫతేనగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బీజేపీ కూకట్‌పల్లి నియోజవకవర్గ ఓబీసీ ఇన్‌చార్జిగా ఫతేనగర్ మాజీ కార్పొరేటర్, బీజేపీ నాయకుడు ముద్దాపురం కృష్ణగౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీకి చెందిన నాయకులు, అభిమానులు కార్యకర్తలు ముద్దాపురంను ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు.

విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం



విజేతలతో సత్యం శ్రీరంగం, తూము వేణు తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సత్యం శ్రీరంగం అన్నారు. కూకట్‌పల్లి పుల్లారు నారాయణదాస్ కల్యాణ మండపంలో ఆదివారం సీయుద్ద లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 5వ జాతీయస్థాయి ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యం శ్రీరంగం హాజరై విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలుపు, ఓటములు అనేది సహజం, లక్ష్యం పెట్టుకొని ఆడితే విజయం సొంతమవుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు టి.సంతోష్‌కుమార్, షీటీం రుద్రమదేవి, కాంగ్రెస్ పార్టీ బీ-బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు కృష్ణ రాజపుత్, నాయకులు రవి, శ్రీధర్, సత్య శంకర్ తదితరులుపాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌కేకేలో సాహిత్య పురస్కార్ అవార్డు ప్రదానం



కురూర్ విల్సన్‌కు సాహిత్య పురస్కార్ అవార్డును అందజేస్తున్న ప్రొ. కొలకలూరి ఇనాక్‌తో ఎన్‌ఎస్‌కేకే సభ్యులు

బాలానగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బాలానగర్ ఫిరోజ్‌గూడలోని నవీన సంస్కారికా కళా కేంద్రం(ఎన్‌ఎస్‌కేకే)స్కూల్‌లో ఒట్టుపులకల్ వెలుక్కుటి విజయన్ (ఓవీ విజయన్) పురస్కార వేడుకలు ఆదివారం సాయంత్రం స్కూల్ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. మళయాళ భాష సాహిత్యంలో ప్రముఖ భారతీయ రచయిత, కార్టునిస్ట్, రాజకీయ పరిశీలకుడు విజయన్ జ్ఞాపకార్థం నిర్వహించే ఈ వేడుకకు తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ మాజీ వైస్ ఛైర్మన్ ప్రొ. కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలకలూరి మాట్లాడుతూ.. చిన్న మొక్క నుంచి అవార్డులు ఇచ్చే స్థాయికి ఎదిగిన ఎన్‌ఎస్‌కేకే సేవలు అభినందనీయమన్నారు. కేరళ ప్రముఖ రచయిత ఓవీ విజయ్ జ్ఞాపకార్థం 2013 నుంచి నిర్వాహకులు సాహిత్య పురస్కారాలు అందజేస్తుండడం మలయాళ భాషమీద ఉన్న ప్రీతి, గౌరవాన్ని చాటుతుందన్నారు. అనంతరం సాహితీ వేత్త, రచయిత కరూర్ విల్సన్‌కు ఓ విజయన్ సాహిత్య పురస్కార్ అవార్డును, రూ.50,001 విలువ చేసే నగదు బహుమతి చెక్కును అందజేశారు. అనంతరం దీపానారాయణన్ శశీంద్రన్ శాస్త్రీయ నృత్యాలు, మలయాళీ కళా నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌కేకే సెక్రెటరీ బాబు ఉన్నిన్నీ, ఛైర్మన్ ఎన్.ఎం.థామస్, కేంద్ర సాహిత్య అకాడమీ మెంబర్ ప్రొ.కే. రామన్ ఉన్నీ, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత నిఖిలేశ్వర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకి శుభాకాంక్షలు



తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఛైర్మన్‌గా బీఆర్‌నాయుడును, బోర్డు సభ్యులుగా నియమితులైన నన్నూరి నర్సిరెడ్డిని టీడీపీ సీనియర్ నాయకుడు రామోజు శివకుమార్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాతూరు వెంకట్రావు, ఎన్ఎస్ రాజు, టీఎన్ఎస్ఎఫ్ సాయిరామ్, సందీప్, ఉత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

– హైదర్‌నగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి)

స్పోర్ట్స్ ఎరీనాలు వచ్చేస్తున్నాయ్!

- మల్టిపుల్ క్రీడలకు కేరాఫ్ కానున్న నయా కేంద్రాలు
- నెక్సస్ మాల్ ఎదురు ఫ్లైవోవర్ కింద ప్రారంభం
- క్రీడా కారులకు 24/7 అందుబాటులో..



కేపీహెచ్‌బీలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న స్పోర్ట్స్ ఎరీనా

కేపీ హెచ్‌బీకాలనీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో నయా క్రీడా ప్రాంగణాలకు కేరాఫ్‌గా కూకట్‌పల్లి ప్రాంతంలోని ఫ్లైవోర్లు నిలవనున్నాయి. ఇప్పటి వరకు ఫ్లైవోర్ల కింద గార్డెనింగ్, పార్కులు, వాహనాల పార్కింగ్ కోసం మాత్రమే వినియోగించేవారు. కానీ తాజాగా మల్టిపుల్ గేమ్స్ ఆడుకునేందుకు ముంబైలో ఉన్న ఎరీనా తరహాలో కేపీహెచ్‌బీలో నెక్సస్ మాల్ ముందున్న ఫ్లైవోవర్ కింద రూ.78లక్షలతో 11,500 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఎకో డిజైన్స్ సంస్థ ప్రతినిధులు స్పోర్ట్స్ ఎరీనాను అభివృద్ధి చేశారు. 24/7 స్పోర్ట్స్ ఎరీనా క్రీడా కారులకు అందుబాటులో ఉండనుంది. గత నెలలో మేయర్ గద్వాల విజయలక్ష్మి కూడా పరిశీలించి శభాష్ అని, ఈ తరహా క్రీడా ప్రాంగణాలు మరిన్ని అందుబాటులోకి తెస్తే బాగుంటుందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తవగా.. త్వరలోనే ప్రారంభించేందుకు కూకట్‌పల్లి జోన్ అధికారులు ఏర్పాట్లు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

రెండు కోర్టులు.. క్రీడలు ఎన్నో!

కేపీహెచ్‌బీ నెక్సస్ మాల్ ముందు ఫ్లైవోవర్ కింద ఏర్పాటు చేసిన క్రీడా మైదానంలో రెండు కోర్టులు ఏర్పాటు చేశారు. వీటిలో క్రికెట్, బాస్కెట్ బాల్, షటిల్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్‌తో పాటు చిన్నారులు స్కేటింగ్ చేసుకునేందుకు వీలు కల్పిస్తూ మార్కింగ్ కూడా పూర్తి చేశారు. అలాగే చిన్నారులు చెస్, స్నేక్ ల్యాడర్ ఆడుకోవచ్చు. పిల్లలు, పెద్దలకు వేర్వేరు క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు. స్పోర్ట్స్ మీట్‌లు, ఇతరత్రా సక్సస్ మీట్‌లు నిర్వహించుకునేందుకు కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థకు పూర్తి హక్కులు ఇవ్వనున్నారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ ఐఏఎస్ అధికారి అభిలాష అభినవ్ ఇక్కడ పనిచేసే సమయంలో దీనికి అంకురార్పణ చేసి పనులు ప్రారంభించగా.. రూపకల్పన ప్రస్తుత జడ్సీ ఐఏఎస్ అధికారి అపూర్వ్ చౌహాన్ దీన్ని ముందుకు నడిపించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. పార్కింగ్, టాయిలెట్లు, సామగ్రి భద్రపరుచుకునేందుకు, కేఫ్ ఇలా సకల సౌకర్యాలతో స్పోర్ట్స్ ఎరీనాలను అభివృద్ధి చేస్తున్నారు.

మూడుచోట్ల పనులు ప్రారంభం

పైలట్ ప్రాజెక్టు కింద భాగ్యనగరంలో తొలిసారి ఫ్లైవోవర్ కింద స్థలాన్ని క్రీడా కారులకు కేపీహెచ్‌బీలో అందుబాటులోకి తేనున్న నేపథ్యంలో కేపీహెచ్‌బీ నుంచి హైటెక్‌సిటీ వెళ్లే మార్గంలోని నాలుగోఫేజ్ ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) కింద గతంలో తాత్కాలిక రైతుబజార్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో రూ. 1.60 కోట్లు, కైత్లాపూర్ ఆర్వోబీ కింద రూ. 70లక్షలు, బాలానగర్ ఫ్లైవోవర్ కింద రూ. 85 లక్షలతో మల్టిపుల్ క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తున్నారు. క్రీడలపై అవగాహన కల్పించేందుకు ఎక్కడైతే స్పోర్ట్స్ ఎరీనాలను అభివృద్ధి చేస్తున్నారో ఆయా ఫ్లైవోర్ పిల్లర్లకు క్రీడాకారుల చిత్రాలను పెయింటింగ్‌తో గీయిస్తున్నారు. ఇవి ఇప్పుడు చాలా ఆకర్షణీంగా కన్పించడంతో పాటు ఆ ప్రాంతంలో స్పోర్ట్స్ ఎరీనా ఉందని తెలిసేందుకు కూడా ఈ తరహా చిత్రాలు బాగా ఉపకరిస్తాయని అధికారులు విశ్వశిస్తున్నారు.

నెలకు రూ. 2.5 లక్షలు అద్దె

హైదరాబాద్‌లో తొలిసారిగా కేపీహెచ్‌బీలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ ఎరీనాను త్వరలోనే క్రీడా కారులకు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. ఇటీవల టెండర్ పిలవగా మూడు సంస్థలు ముందుకు రాగా.. అందులో రెండు క్వాలిఫై అయ్యాయి. ఎక్కువ బిడ్ వేసిన సంస్థకు మేము ఎరీనాను ఏడాది పాటు అద్దెకు ఇచ్చేందుకు నిర్ణయించాం. నెలకు రూ. 2.5 లక్షలు అద్దె ఇచ్చేందుకు ఓ సంస్థ ముందుకొచ్చింది. దీన్ని వినియోగంలోకి తేవడంతో పాటు త్వరగా మరో మూడు ఎరీనాలు కూడా అందుబాటులోకి తెచ్చేందుకు పనులు జరుగుతున్నాయి.

– పొద్దుటూరి చిన్నారెడ్డి, ఎస్ఈ, కూకట్‌పల్లి జోన్





నాలుగోఫేజ్ ఆర్వోబీ కింద రూపుదిద్దుకుంటున్న ఎరీనా, రాజీవ్ గాంధీ ఫ్లైవోవర్ పిల్లర్లకు క్రీడా కారుల బొమ్మలు

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు



కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కిలో కూరగాయల ధరలు. టమోట రూ.33, వంకాయ రూ.50, బెండకాయ రూ.40, పచ్చిమిర్చి రూ.45, బజ్జి మిర్చి రూ.80, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.35, బీన్స్ రూ.95, క్యారెట్ రూ.75, గోబి పువ్వు రూ.35, దొండకాయ రూ.40, చిక్కుడు కాయ రూ.95, గోరు చిక్కుడు రూ.55, బీట్‌రూట్ రూ.50, క్యాప్సికం రూ.75, ఆలుగడ్డ రూ.41, కీర రూ.17, దోసకాయ రూ.40, సొరకాయ రూ.25, పొట్లకాయ రూ.23, కంద రూ.65, ఉల్లిపొరక రూ.55, ఉల్లిగడ్డ రూ.45, మామిడికాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.38, ముల్లంగి రూ.4-5, చిలగడదుంప రూ.40, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.50-60, మునగ కాయలు రూ.8-10, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.380, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.100, కరివేపాకు రూ.70, పర్వల్ రూ.45, పల్లికాయ రూ.75, లోబా రూ.45, ఆ కాకరకాయ రూ.100. పైన పేర్కొన్న ధరలు సోమవారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు ప్రజావాణి

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంతో పాటు కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒకటి వరకు ప్రజావాణి ఉంటుంది. జీహెచ్ఎంసీకి సంబంధించిన రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, పారిశుధ్యం, దోమలు, వీధి దీపాలు ఇతరత్రా సమస్యలు ఏమున్నా జడ్సీ, డీసీలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి సమాధానం కోరవచ్చు. సర్కిళ్ల పరిధిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోతే వాటిపై జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయొచ్చు.

సమస్యలు పరిష్కరిద్దాం.. గుర్తింపు పొందుదాం

- విద్యుత్ వినియోగదారుల దినోత్సవంలో సీఈ, ఎస్ఈ సూచనలు



మాట్లాడుతున్న సైబర్‌సిటీ ఎస్ఈ చంద్రశేఖర్

కేపీహెచ్‌బీకాలనీ/ ఓల్డుబోయినపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమస్య తెలుపగానే వెంటనే అలర్ట్ అయ్యి వాటి పరిష్కారానికి చొరవ తీసుకున్నప్పుడే తమకు తగిన గుర్తింపు లభిస్తుందని రంగారెడ్డి జోన్ సీఈ పాండ్య, సైబర్ సిటీ ఎస్ఈ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం కేపీహెచ్‌బీ సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో కొండాపూర్, గచ్చిబౌలి డివిజన్లకు సంబంధించి విద్యుత్ వినియోగదారుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్స్ వ్యక్తిగత గృహ సముదాయాలకు సంబంధించిన వినియోగదారులు హాజరై అధికారులు, సిబ్బంది పనితీరును మెచ్చుకోవడంపై సీఈ, ఎస్ఈ సంతోషం వ్యక్తం చేశారు. వినియోగదారుల సమస్యలు పరిష్కరిద్దా.. గుర్తింపు పొందుదామని ఆయన అధికారు లకు సూచించారు. వినియోగదారులు సమస్యను టీజీఎస్‌పీడీసీఎల్



సదస్సులో పాల్గొన్న డీఈ గోపాల్‌రావుతో ఏడీఈలు

యాప్, 1912, ట్విట్టర్ ద్వారా కూడా తెలియజేవచ్చన్నారు. డీఈలు యాదగిరి, శ్యాంకుమార్, దామోదర్, ఏడీఈ మాణిక్యాలు పాల్గొన్నారు.

● విద్యుత్ వినియోగదారులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని బోయినపల్లి డివిజన్ డీఈ గోపాల్‌రావు అన్నారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆదివారం బోయినపల్లి డీఈ కార్యాలయం ప్రాంగణంలో అవగాహన సదస్సు, వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లులు, ఓల్టేజీ సమస్య, మీటర్ సంబంధింత ఫిర్యాదులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారుల సమస్యలు వెంటనే పరిష్కారం చేసేందుకు సంబందిత ఏరియా ఏడీఈలు, ఏఈలకు సూచనలు చేసినట్లు డీఈ తెలిపారు. కార్యక్రమంలో బాలానగర్ ఏడీఈ పులి సూర్యప్రకాశ్, రంగారెడ్డినగర్ ఏడీఈ సతీష్‌కుమార్, రంగదారెడ్డినగర్, బోయినపల్లి ఏడీఈ ఎండీ హాక్, కస్టమర్ సర్వీస్ సెంట్ ఏడీఈ రోషన్, ఆపరేషన్ ఏఈలు వీణ(బాలానగర్), అక్బర్(ఐడీపీఎల్), రాణీ(ఫిరోజ్‌గూడ), శ్రీరాములు(రంగారెడ్డినగర్), మౌనిక (న్యూ బోయినపల్లి), అఖిల్(ఓల్డుబోయినపల్లి), అకౌంట్స్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన

అల్లాపూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బోరబండ కూడలి సమీపంలో బీజేపీ యువ మోర్చా నేత సందీప్ నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ కన్వీనర్ శ్రీకర్ రావు హాజరయ్యారు. కార్యక్రమంలో రాంగోపాల్ సింగ్, నవీన్, జలంధర్, వెంకటరాంరెడ్డి, మల్లేశ్, సదర్శన్ ముదిరాజ్, నార్లపురం శ్రీనివాస్, భగవాన్, ఉదయ్‌రాజ్, కిరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నందమూరి సుహాసిని అక్క యువసేన అధ్యక్షుడు హరి సురేష్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూ. 100 చెల్లించి పార్టీ సభ్యత్వం తీసుకుంటే రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. యువత ఎక్కువగా ఆఫ్‌లైన్‌లో కంటే ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కార్యక్రమంలో నిమ్మగడ్డ ఆరూప్, బాచిన సుబ్బారావు, ఆలం శివ, పునాటి కిరణ్, లింగా శివప్రసాద్, వెంకటేశ్వరరావు, భాస్కరరావు, వీరబాబు, పత్తి సుబ్బారావు, వడ్లమూడి శ్రీనివాసరావు, వేజెండ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



బాలానగర్ పరిధిలోని రాజూకాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట కాంట్రాక్టర్ అంజనేయులు బీఆర్ఎస్ నాయకులు కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

– బాలానగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి)

'ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

హైదర్‌నగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 5న ఇంద్రాపార్క్ వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ కూకట్‌పల్లి మండల కార్యదర్శి కృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మనచారి, దావీద్, ఎండి ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల దాడి.. బాలుడికి గాయాలు

అల్లాపూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ రాజా ప్రతాప్ నగర్‌లో శనివారం సాయంత్రం దారుణం జరిగింది. ఇంటి ఎదుట నడుస్తున్న రెండున్నర సంవత్సరాల బాలుడిని వీధి కుక్కలు గాయపర్చాయి. బస్తీలోని స్థానికుల సమాచారం ప్రకారం.. శనివారం నవాజ్ ఖాన్ అనే రెండున్నరేళ్ల బాలుడు ఇంటి ముందు నడుస్తుండగా మొదట రెండు కుక్కలు బాలుడిని గమనించాయి. ఈ విషయం పసికట్టిన బాలుడు ఇంట్లోకి వెళ్లేందుకు గేటు తెరుస్తుండగా ఆ కుక్కలు బాలుడి వెనుక భగాన్ని నోటితో పట్టుకొని బయటున్న ఇసుక రాశిపై పడేశాయి. ఇంతలో మరో రెండు కుక్కలు వచ్చి బాలుడిపై దాడి చేస్తుండగా అలికిడికి తల్లి వాజిదా, ఇరుగు పొరుగు వారు రావడంతో కుక్కలు పారిపోయాయి. బాలుడిని ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ చేసి ఇంటికి పంపించారు. పట్టపగలు ఇలా వీధికుక్కలు బాలుడిపై దాడి చేయడాన్ని స్థానికులు ఖండించారు. రోజురోజుకూ వీధికుక్కల బెడద పెరిగిపోతుందని, అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండడంలేదని వారు వాపోతున్నారు. పెద్ద ప్రమాదం తప్పిందని, లేదంటే బాలుడి ప్రాణాలకు హాని జరిగుండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

వారాంతాల్లో స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్

- మద్యం తాగి వాహనాలు నడిపిన 513 మందిపై కేసులు

హైదరాబాద్ సిటీ, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా సైబరాబాద్ పరిధిలో వారాంతపు స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారు. ఈనెల 1, 2, 3 తేదీల్లో కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేసిన ట్రాఫిక్ పోలీసులు 513 మందిపై కేసులు నమోదు చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన 513 మందిలో 425 మంది ద్విచక్రవాహనదారులు, 24 మంది ఆటోడ్రైవర్లు, 60 మంది కారు నడిపే వారు, 4 భారీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

అయ్యప్ప స్వాములకు ఉచిత వసతి

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అయ్యప్ప స్వాములకు కేపీహెచ్‌బీలో ఉచిత వసతి, భిక్ష కల్పిస్తున్నట్టు యూత్ మీల్స్ నిర్వాహకులు పోక శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. కార్తీక సోమవారం పురస్కరించుకొని ఈనెల 4వ తేదీ నుంచి వచ్చే ఏడాది 2025 జనవరి 15వ తేదీ వరకు విద్యుత్, నీటి వసతి ఉంటుందన్నారు. జంట నగరాల్లో ఎంతో మంది అయ్యప్ప మాలధరించి ఆర్థిక స్తోమత లేక గదులు అద్దెకు తీసుకోలేక, ఆలయాల్లో కనీస రుసుం కూడా చెల్లించలేని మాలధారులను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. వివరాల కోసం 9247478121లో సంప్రదించొచ్చు.

ప్రముఖ శైవ క్షేత్రాలకు టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బాలానగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రముఖ శైవ క్షేత్రాలకు టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు కూకట్‌పల్లి ఆర్టీసీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం, వేముల వాడ, ధర్మపురి, కీసరగుట్ట పవిత్ర శైవ క్షేత్రాలకు ఈ బస్సులు ఉంటాయన్నారు. ఆది, సోమవారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో ఈ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నవంబరు 15 కార్తీక పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలానికి ప్రత్యేక ప్యాకేజీని అందిస్తున్నట్టు తెలియజేశారు. ఏపీలోని పంచరామాలకు ప్రతీ సోమవారం బస్సులు నడుపుతున్నట్టు వివరించారు. ప్రత్యేక బస్సుల కోసం టీజీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాల్సి ఉంటుందని వారు వెల్లడించారు. వివరాలకు 040- 69440000, 040-23450033 నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు.

ఓల్డుబోయినపల్లిలో అలయ్ బలయ్



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డుబోయినపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్‌లో ఆదివారం రాత్రి అలయ్ బలయ్ కార్యక్రమం సందడిగా జరిగింది. డివిజన్‌కు చెందిన రాజీవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల్లో పండుగల ఉత్సాహం తగ్గిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా తెలంగాణ బిడ్డలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాజూముదిరాజ్, సీనియర్ నాయకుడు నరేందర్‌గౌడ్, కర్రెజంగయ్య, మక్కల నర్సింగ్‌రావు, ఇర్ఫాన్, హరినాథ్, రాజూగౌడ్, బాలరాజు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనం

అల్లాపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మూసాపేట్ డివిజన్ అవంతి నగర్ (ఈస్ట్) కాలనీలో ఆదివారం రాత్రి జరిగిన సదర్ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరయ్యారు. కాలనీ వాసి శశి యాదవ్ ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం జరిగింది. ఈకార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, తిరుపతి, దర్మయ్య, యాదవులు, కాలనీవాసలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే కృష్ణారావు

హైదర్‌నగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసి మెజార్టీతో గెలిపించిన కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు వచ్చిన అండగా ఉంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం మూసాపేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో స్థానిక మాజీ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. డివిజన్లలో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు హైడ్రా పేరును అడ్డుపెట్టుకొని వసూళ్లకు పాల్పడుతున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ... పది సంవత్సరాలుగా వందల కోట్ల రూపాయలతో మూసాపేట డివిజన్‌ను అభివృద్ధిచేశామని, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, ట్రాఫిక్ సమస్యల పరిష్కరించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నియోజకవర్గానికి ఒక్కరూపాయి కూడా ఇవ్వకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీని గెలిపిస్తే ప్రజలకేమైన న్యాయం చేశారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మకై బీఆర్ఎస్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నాయని, అభివృద్ధి పైన దృష్టి సారించడం లేదన్నారు. పెద్ద వాళ్ల భవంతులను కూల్చడం మానేసి పేదోళ్ల కడుపులు కొట్టడానికి హైడ్రా తీసుకొచ్చారని పేర్కొన్నారు. ప్రజలకు తాము అండగా ఉంటామని తెలిపా రు. కార్యక్రమంలో డివిజన్ అధక్షుడు అంబరి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, జిల్లా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'కౌన్సిలర్‌గా గెలిపించారు.. ఎమ్మెల్యే అయ్యాను'

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మూడు సార్లు ఎమ్మెల్యే అయ్యానంటే అదంతా హైదర్‌నగర్ ప్రజలు తనన్ను కౌన్సిలర్‌గా గెలిపించడం తోనే సాధ్యమైందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. హైదర్‌నగర్‌లో ముస్లిం మతపెద్దలు ఆదివారం నిర్వహించిన గ్యార్వీ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. కుల, మత ప్రాంతాలకు అతీతంగా పండుగలు జరుపుకొందామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, మహ్మద్ గౌసుద్దీన్, గొట్టిముక్కల భాస్కర్‌రావు, కలీం, నక్క శ్రీనివాస్, సిద్దం శ్రీకాంత్, నర్సింగరావు, వెంకటేష్, సలీం, జుబేదా బేగం, జ్యోతి పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతర కృషి

● చందానగర్ ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి



ఇంటర్వ్యూ

చందానగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషిచేసి ప్రజల ధన, ప్రమాణాలను రక్షించేందుకు సిద్ధంగా ఉన్నామని చందానగర్ ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి అన్నారు. చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు పోలీసులు నిరంతరం కృషిచేస్తున్నారని అన్నారు. రాత్రి సమయంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి కాలనీలో గస్తీ నిర్వహిస్తున్నాం. ఫ్రెండ్లీ పోలీస్‌తో ప్రజలతో స్నేహ భావంతో మెలుగుతు నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆదివారం ఆంధ్రజ్యోతి ఆయనతో నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నాం. రాత్రి సమయాల్లో నేరాలను అరికట్టేందుకు మొబైల్ గస్తీలు, పెట్రోలింగ్ వ్యవస్థను బలోపేతం చేశాం. నేర నియంత్రణకు బ్లూకోర్టు పోలీసుల సహకారంతో నేరాల నియంత్రణ చేస్తున్నాం.

సీసీ కెమెరాల ఏర్పాటు నిర్మాణం జరుగుతుందా?

చందానగర్ పీఎస్ పరిధిలో కాలనీలోని ప్రధాన, అంతర్గత రోడ్లు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం వాటిని పర్యవేక్షిస్తున్నాం. ప్రత్యేక సిబ్బందితో సీసీ కెమెరాల నిర్వహణ, మానిటరింగ్ ఎప్పటికప్పుడు చేస్తున్నాం. అధునాతనమైన సీసీ కెమెరాలను ఆయా ప్రధాన కూడళ్లలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని సీసీ కెమెరాలు సాంకేతిక పరమైన లోపాలతో పనిచేయడం లేదు. వాటిని మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

సైబర్ క్రైం జరిగితే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారా?

సైబర్ క్రైం జరిగితే చట్టప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేస్తాం. 50 వేలలోపు అయితే పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది. కేసులు నమోదు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

స్టేషన్ పరిధిలో ఎలాంటి నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి?

పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా ద్విచక్రవాహనాల చోరీలు, మిస్సింగ్ కేసులు నమోదు అవుతున్నాయి.

ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థలో మీ పాత్ర ఎలా ఉంది?

ప్రజలతో మమేకమై ముందుకెళ్తున్నాం. పండగలు, వేడుకలు జరిగే సమయంలో ప్రజలకు అవగాహన కల్పించి, డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన పూర్తి సహకారం అందిస్తున్నాం. సైబర్ క్రైం తదితర విషయాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజల సహకారం ఉంటే నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

● యథేచ్ఛగా విద్యుత్ శాఖ అనుమతులు
● సమస్యలను పరిష్కరించాలని స్థానికులు

రాయదుర్గం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్‌లోని టెలిఫోన్‌నగర్, ముస్లిం బస్తీ, రాయదుర్గం, ఖాజాగూడ, గౌలిదొడ్డితో పాటు పలు ప్రాంతాల్లో ఎలాంటి భద్రతా ప్రమాణాలను పాటించకుండా ఇళ్ల మధ్యనే ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు కూడా అనుమతులు జారీ చేశారు. గల్లీల్లో విద్యుత్ వైర్లు, కేబుల్ వైర్లు వేలాడుతున్నాయి. చిన్న ప్రమాదం సంభవించిన భారీగా నష్టం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో జీహెచ్ఎంసీ అనుమతులు లేకుండా బహుళ అంతస్తులు నిర్మించి కమర్షియల్‌గా వ్యాపారాలు సాగిస్తున్న వారు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఐటీ కారీడార్‌కు అతి చెరువులో ఉండటంతో పాటు అద్దెలు కుడా మిగతా ప్రాంతాలతో పోల్చితే తక్కువగా ఉండడంతో ఉద్యోగులు ఇక్కడ నివసించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇదే అదునుగా భావించి రెసిడెన్షియల్ ఇళ్లను హాస్టళ్లుగా మార్చి ఇంటి ఆవరణలోనే ప్రమాదం అని తెలిసినా ట్రాన్స్‌ఫార్మర్లను బిగుస్తున్నారు. ఇలాంటి వాటికి అనుమతులు లేకపోయినా అధికారుల నిర్లక్ష్యం మూలంగా యథేచ్ఛగా ఏర్పాటు చేస్తున్నారు.

వెంటనే ఇలాంటి ట్రాన్స్‌ఫార్మర్లకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, స్థలం లేని ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మను వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.




ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు, రక్షణ కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

చర్యలు తీసుకోవాలి

ప్రైవేటు వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకుంటూన్నారు. ఇంటి అవరణలో స్థలం లేక పోయినా రోడ్డుపైనే స్తంబాలను పాతి ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చుతున్నారు. అధికారులు సైతం ఇది తప్పుఅని అపడం లేదు. ప్రమాదాలు జరగక ముందే చర్యలు తీసుకోవడం మంచిది.

-మహేదర్, గచ్చిబౌలి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): టెలిఫోన్ ఎక్ఛేంజ్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. టెలిఫోన్ ఎక్ఛేంజ్ క్వార్టర్స్, ఎస్‌బీఐ బ్యాంకు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

పీజేఆర్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో

హైదర్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పీజేఆర్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పీజేఆర్‌నగర్, జన్మభూమికాలనీ, శివమ్మకాలనీ, సుభాష్‌చంద్రబోస్‌నగర్, మహవీర్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న మాతృశ్రీనగర్ కాలనీ వాసులు

మాతృశ్రీనగర్‌కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హైదర్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ మాతృశ్రీనగర్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలపై ఆదివారం వివేకానందనగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని కలిసి అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, అవసరమైన చోట యూజీడీ పైపులైన్లు వేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ త్వరలోనే మాతృశ్రీనగర్ కాలనీలో పర్యటించి సమస్యలు పరిశీలిస్తామని, అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మాతృశ్రీనగర్ కాలనీ వాసులు అనిల్ కావూరి, నాగరాజు, కిషోర్, విజయ్, చందు, రమణ, గోపి, సతీష్, వంశీ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మియాపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ ఆదిత్యనగర్ కాలనీలోని సెయింట్ ఇసాక్ అడ్వెంట్ హైస్కూల్‌లో సెయింట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఉచితంగా వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో పాల్గొన్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ ఇసాక్ లజర్స్, ప్రిన్సిపాల్ కమర్‌జాన్ ఇసాక్, అక్తర్, మహమ్మద్ బేగ్, ఆదిత్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ఖాసీం, సర్ఫరాజ్ మెహినుద్దీన్, అమీర్, ఫజల్,షేక్ అస్లాం, రఫీక్, షబీర్, వైద్యులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజస్థాపనకు యువత కృషి చేయాలి

● భెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజా



సమావేశంలో మాట్లాడుతున్న భెల్ ఈడీ రాజా

భెల్‌కాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజస్థాపనకు యువత కృషి చేయాలని బీహెచ్ఈఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేబీ రాజా అన్నారు. ప్రతీయేటా భెల్ రామచంద్రాపురం యూనిట్‌లో అక్టోబరు 28 నుంచి నవంబరు 3వ తేదీ వరకు నిర్వహించే నిఘా అవగాహన వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం, దేశం అభివృద్ధి చెందాలంటే అవినీతిని పూర్తిగా నిర్మూలించాలని సూచించారు. కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం అన్ని చర్యలు తీసుకుంటుందని, పరిశ్రమ అభివృద్ధికి కార్మికులు కృషి చేయాలని సూచించారు. అధికారులు కార్మికులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా భెల్ పరిశ్రమ వద్ద నుంచి 3కే వాక్‌థాన్ నిర్వహించి సమగ్రత సంస్కృతితో దేశ శ్రేయస్సు అనే నినాదం చేస్తూ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఉద్యోగులు, విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీలల్లో గెలుపొందిన వారికి జ్ఞాపికలను అందచేశారు. పీఈ అండ్ ఎస్‌డీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, పలు విభాగాల జనరల్ మనేజర్లు, ఉన్నతాధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



3 కే ర్యాలీలో పాల్గొన్న భెల్ ఈడీ రాజా, అధికారులు



ఓపెన్‌జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

సెవెన్‌హిల్స్ శేషాద్రి బ్లాక్‌లో ఓపెన్ జిమ్ ప్రారంభం

హైదర్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ సెవెన్‌హిల్స్ శేషాద్రి బ్లాక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆదివారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఓపెన్ జిమ్ ఏర్పాటుకు శేషాద్రి బ్లాక్ అసోసియేషన్ వారు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరు కనీసం గంట పాటు వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి స్థాపన కోసం బ్రాహ్మణులు ముందుండాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న గ్రేటర్ అధ్యక్షుడు వల్లాల రామ్మోహన్

భెల్‌కాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతి స్థాపన కోసం బ్రాహ్మణులు ముందుండాలని బ్రాహ్మణ సంక్షేమ సంఘం తెలంగాణ అధ్యక్షుడు వల్లాల రామ్మోహన్ అన్నారు. అఖిల బ్రాహ్మణ సమాజాభివృద్ధి సమాఖ్య బీహెచ్ఈఎల్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం భెల్ టౌన్‌షిప్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం, 59వ కార్తీకమాస మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహంచారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి జీవీఎస్.మూర్తి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పలువురు పూర్వ కమిటీ సభ్యులు, వృద్ధ సభ్యులను ఘనంగా సన్మానించారు. వేడుకలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ 58 ఏళ్లుగా సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించడం ఆదర్శప్రాయమన్నారు. రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పథకాల ద్వారా బ్రాహ్మణ విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. సమాజంలో శాంతి స్థాపనకు బ్రాహ్మణుల పాత్ర ముఖ్యమైనదన్నారు. ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. అనంతరం ప్రముఖ న్యాయవాది ఎస్వి.ఆంజనేయులు ఆస్తి పంపకాలు, వివాదాలు, రిజిస్ట్రేషన్‌లు తదితర అంశాలపై వివరించారు.

కార్యక్రమంలో వివిధ శాఖ ప్రతినిధులు కేకేటీ శర్మ, కృష్ణ, నాగేశ్వరరావు, పణికుమార్, ఆర్‌సీవీఎస్ ప్రసాద్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గోర్తి శ్రీనివాస్, కోశాధికారి మంగళంపల్లి రామ్‌మూర్తి, సభ్యులు ప్రసాద్, గంటి రామకృష్ణ, వేణుగోపాల్, రత్నకుమారి, వెంకటరమణ, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

అయ్యప్ప ఆలయంలో లక్ష కుంకుమార్చన

చందానగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చందానగర్ జగత్‌రక్షకా శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో కేపీ శ్రీనివాస్ సౌజన్యంతో ప్రసాద్ గురుస్వామి ఘనంగా లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమానికి చందానగర్, పటాన్‌చెరు పరిసర ప్రాంత అయ్యప్ప దీక్షదారణ పొందిన స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

కార్యాలయంలో భక్తులు, ఆలయకమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాజం మార్పునకు కులసంఘాల పాత్ర కీలకం

● ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

భెల్‌కాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యువతకు విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అవకాశాలు కల్పించి వారిని నిపుణులుగా తీర్చిదిద్ది సమాజంలో మార్పుకు కుల సంఘాలు కృషి చేయాలని మాజీ కేంద్ర మంత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. శ్రీ కృష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భెల్ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో 58వ కార్తీకమాస వనమహోత్సం ఘనంగా నిర్వహించారు. కాపు సంఘం రాష్ట్ర నాయకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శేరిలింగంపల్లి, పటాన్‌చెరు నియోజకవర్గాలకు చెందిన దాదాపు 9 వేల మంది కాపులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ ఉమారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వశక్తితో ఎదగాలని, కులంలోని పెద్దలు యువతకు చేయూతనందిస్తూ వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఇతర కులాలను గౌరవిస్తూ కుల సభ్యులకు ప్రాధాన్యం ఇచ్చి అండగా ఉండాలని కోరారు. యాంత్రిక జీవనానికి అలవాటు పడి, మన సంస్కృతి సంప్రదాయాలను విస్మరిస్తున్న నేటితరానికి పండుగలు, వాటి విలువలను తెలపాలన్నారు.



పత్రికను ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, ముఖ్యఅతిథులు



టీటీడీ బోర్డు సభ్యురాలు రంగశ్రీరత్నంను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంత్‌రావు మాట్లాడుతూ కుల సంఘాలు తమ తోటు కులస్థులకు చేయూతనందించడమే కాకుండా సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని సూచించారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు చేయూత నందించి, నిరక్షరాస్యత నిర్మూలన కోసం కృషి చేయాలని కోరారు. ఐకమ్యతంగా ఉంటేనే సుఖసంతోషాలతో జీవించగలుగుతామన్నారు. అనంతరం టీటీడీ బోర్డు సభ్యురాలిగా నియమితులైన రంగశ్రీరత్నంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సినీరంగ ప్రముఖులు రోజారమణ, రజీవ్ కనకాల, చక్రపాణి, బేబి రాణి, గుమ్మడి గోపాలకృష్ణ, సమ్మెటగాంధీ మున్నూరుకాపు రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య, శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు ఎంహెచ్.రావు, మజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, డాక్టర్ నంద కిషోర్, పర్వా పరమేశ్వర్‌రావు, నాగమోహన్ పలువురు సినీ ప్రముఖులు ప్రసంగించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందచేసి గమన్ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిచారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైష్ణవినాట్య సెంటర్ గురువర్యులు డాక్టర్ వైష్ణవి సాయినాథ్ శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శన అద్యంతం అలరించింది. పుష్పాంజలి, అలరింపు, జతిస్వరం, శివతాండవం, కళింగనర్తన, రామస్తుతి, శివశక్తి స్తుతి, కృష్ణస్తుతి, జావళి అంశాలపై చక్కటి ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు.




కళాకారుల నృత్యప్రదర్శన

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హైదర్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 5న ఇందిరాపార్క్‌వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కూకట్‌పల్లి మండల ఏఐటీయూసీ మండల కార్యదర్శి కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మనచారి, దావీద్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రీకౌంటింగ్ నిర్వహించాలి

హెచ్‌సీయూ స్టూడెంట్ యూనియన్ స్వతంత్ర అభ్యర్థి కాష్ భాటి

పంజాగుట్ట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికల రీకౌంటింగ్ పారదర్శకంగా నిర్వహించాలని, అధ్యక్ష పదవికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పరిశోధక విద్యార్థి ఆకాష్ భాటి డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టూడెంట్ యూనియన్ ఎన్నికలు గతనెల 25న జరిగాయని, 26న ఓట్ల లెక్కింపు జరిగిందని, తనకు అనుమానం రావడంతో రీకౌంటింగ్ కోరగా ఈనెల 2న రీకౌంటింగ్ నిర్వహించారన్నారు. ఏఎస్ఏ-బీఎస్ఎఫ్-డీఎస్ యూ-ఎస్ఎఫ్ఐ సంఘాల అలయన్స్ అభ్యర్థి ఉమేష్ అంబేడ్కర్‌కు 1313 ఓట్లు రాగా, తనకు 1,295 ఓట్లు వచ్చాయన్నారు. ఎన్నికల లెక్కింపు పారదర్శకంగా నిర్వహించలేదని ఆరోపించారు. చెల్లని ఓట్లను లెక్కించి ఉమేష్ గెలిచినట్లు అధికారులు ప్రకటించారని, ఆయన ఖాతాలో 28 చెల్లని ఓట్లు జమ చేశారన్నారు. మరోసారి రీకౌంటింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. తన డిమాండ్‌పై ఎన్నికల అధికారులు స్పందించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని హెచ్చరించారు. విద్యార్థులు సిద్దార్థ్ శుక్లా, అభినవ్ పాల్గొన్నారు.

ఓబీసీ ప్రభుత్వ ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండాలి

రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

రాంనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ పేర్కొన్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేస్తున్న ఓబీసీ ఉద్యోగులందరూ ఐక్యతను చాటి తమకు రావాల్సిన వాటాను సాధించుకోవాలని పేర్కొన్నారు. బీసీ జనాభా లెక్కలు తేల్చి రాజ్యాంగపరంగా రావాల్సిన వాటాను ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ఈనెల 6వ తేదీ నుంచి బీసీ జనాభా లెక్కల సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో బీసీలందరూ పాల్గొని తమ వివరాలను సర్వే బృందానికి తెలియజేయాలని సూచించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శంకర్, ఎం.మోహన్‌ల అధ్యక్షతన సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిరంజన్ మాట్లాడుతూ స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ గ్రామీణ ప్రాంతంలోని పేద ప్రజలకు బ్యాంకు రుణాలు అందజేయాలనే లక్ష్యంతో గ్రామీణ బ్యాంకులను ప్రారంభించారని తెలిపారు. గ్రామీణ బ్యాంకులు గ్రామాలలోని పేదలకు కావాల్సిన రుణాలను అందజేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు బ్యాంకు ఉద్యోగులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ శాఖలలో పని చేసే ఓబీసీ ఉద్యోగుల మనోభావాలను గుర్తిస్తూ వాటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఓబీసీ ఉద్యోగులపై ఉన్న క్రిమిలేయర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తగిన ప్రమోషన్లు వచ్చేలా పాటుపడతామన్నారు. అనంతరం తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ శోభ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు తమ బ్యాంకు సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. ఓబీసీ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి శంకర్, మోహన్‌లు మాట్లాడుతూ ఓబీసీ ఉద్యోగులకు న్యాయపరంగా రావాల్సిన ప్రమోషన్‌లు ఇతర బెనిఫిట్‌లు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ బ్యాంకులో రాష్ట్ర వ్యాప్తంగా 900 ఓబీసీ ఉద్యోగులు పని చేస్తున్నారని వారన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి నూతన కమిటీ ఎన్నికవుతుందన్నారు. సమావేశంలో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.కరుణానిధి, ఏఐఆర్‌ఆర్‌బీఈఏ సెక్రటరీ జనరల్ ఎస్.వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌బీఐ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజు, వివిధ సంఘాల నాయకులు చిన్నయ్య, రవికాంత్, దానకర్ణచారి, శ్రీనివాస్‌గౌడ్, లోకేష్, శ్రీనివాస్‌యాదవ్, మధుసూదన్, అశోక్, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సదస్సులో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

మూసీలో దూకి యువకుడి ఆత్మహత్యాయత్నం

● తీవ్రగాయాలతో ప్రాణాపాయ స్థితికి
● నల్లగొండ జిల్లా కేతేపల్లిలో ఘటన



కేతేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వంతెన పైనుంచి మూసీ నదిలోకి దూకి యువకుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామ శివారులో ఆదివారం జరిగింది. ఎస్ఐ శివతేజ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణాజిల్లా గన్నవరానికి చెందిన వై. కృష్ణ కుమారుడు యశ్వంత్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. దీపావళి పండుగకు స్వగ్రామం వెళ్లిన యశ్వంత్ ఆదివారం హైదరాబాద్‌కు తన ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. మార్గం మధ్యలో మధ్యాహ్నం మూసీ నదిపై గల వంతెన పైకి రాగానే రోడ్డు పక్కకు మోటార్ సైకిల్‌ను నిలిపిన యశ్వంత్ వంతెనపై నుంచి నదిలోకి దూకేశాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి కేతేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శివతేజ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వచ్చి అతడిని నదిలోంచి బయటకు తీయించారు. తీవ్రగాయాలు కావడంతో ప్రాణాపాయ స్థితికి చేరిన అతడిని 108 అంబులెన్స్‌లో సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడి వద్ద లభించిన ఆధారాలతో గన్నవరంలోని అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కబ్జాల పాలవుతోన్న ప్రభుత్వ స్థలాలు

జీడిమెట్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండల అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో జగద్గిరిగుట్టలో భూకబ్జాదారులు బరి తెగిస్తున్నారు. తమకు అడ్డూఅదుపు లేదన్నట్టు ఎక్కడబడితే అక్కడ ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇటీవల జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న వాటర్‌ట్యాంక్ పక్కన నెలరోజుల క్రితం ఓ వ్యక్తి

మామూళ్ల మత్తులో రెవెన్యూ అధికారులు

కబ్జాచేసి నిర్మించిన గదిని రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా కూల్చివేశారు. నేడు అదే నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో నిర్మించి కబ్జాకు పాల్పడుతున్నారు. రాజీవ్ గృహకల్ప ప్రాంతంలోని బ్లాక్ నంబర్ 49 ముందు ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసి కొందరు పెద్దఎత్తున బేస్‌మెంట్ నిర్మించినా ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా రాజీవ్ గృహకల్ప సమీపంలో విచ్చలవిడిగా డబ్బాలు ఏర్పాటు చేసి కబ్జాలకు పాల్పడుతున్నారు. రెవెన్యూ ఉన్నతాధికారులు జగద్గిరిగుట్టలో సాగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పోలీస్‌స్టేషన్ ఎదురుగా వాటర్ ట్యాంక్ పక్కన నిర్మించిన గది


రాజీవ్ గృహకల్ప బ్లాక్ నంబర్ 49 ముందు నిర్మించిన బేస్‌మెంట్



పదిరోజులకే విరిగిన చెత్త వాహనం

పదిరోజుల క్రితం పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేసిన చెత్తను తరలించే వాహనం విరిగిపోవడంతో కార్మికులు రోడ్డుపైనే వదిలేశారు. కాంట్రాక్టర్లు నాసిరకంగా తయారుచేయడంతో కొద్దిరోజులకే మూలన పడింది.

- కుత్బుల్లాపూర్(ఆంధ్రజ్యోతి)

తవ్వారు.. వదిలేశారు

● నిత్యం నరకం చూస్తున్న వాహనదారులు

నిజాంపేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో రహదారులన్నీ గుంతలమయమే. దీనివల్ల వాహనదారులు, పాదచారులు నరకం చూస్తున్నారు. ముఖ్యంగా ఏనుగుల బొమ్మ చౌరస్తా నుంచి ఇటు ఎలీఫ్ రోడ్డు వరకు మరమ్మతుల కోసం ఒక వైపు మొత్తం తొలగించారు. సకాలంలో నిర్మించాల్సిన నూతన రోడ్డును నెలలు గడుస్తున్నా వేయడం లేదు. ఇదే తరహాలో వైఎస్‌ఆర్ విగ్రహం మొదలుకొని కోతుల బొమ్మ చౌరస్తా వరకు రోడ్డుపై ఒక వైపు భారీ గుంతలు దర్శనం ఇస్తున్నాయి. నిత్యం ఇదే రోడ్డు నుంచి రాకపోకలు సాగించే కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆ గుంతలను పూడ్చించాలనే ఆలోచన రాకపోవడం కొంత ఆశ్చర్యానికి గురి చేస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాల్సిన అంబులెన్స్ డ్రైవర్లు ఆ దారి గుండా వెళ్లలేక కొట్టుమిట్టాడుతున్నారు. కనీసం తవ్వి వదిలేసిన రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టడంతో పాటు వైఎస్‌ఆర్ విగ్రహం నుంచి కోతుల బొమ్మల వరకు ఏర్పడిన గుంతలను పూడ్చి, మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.


తవ్వి వదిలేసిన రోడ్డులో ముందుకు సాగలేని అంబులెన్స్


గతుకుల రోడ్డులోనే ఇబ్బందులు పడుతూ ప్రయాణిస్తున్న వాహనదారులు

నీటి కనెక్షన్ లేని కమోడ్స్.. గడియ లేని తలుపులు

● అధ్వానస్థితిలో బాలానగర్ డీసీపీ కార్యాలయంలోని బాత్రూమ్‌లు


పగిలిపోయిన కమోడ్


పగిలిపోయిన తలుపు

జీడిమెట్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డీసీపీ కార్యాలయంలోని బాత్‌రూమ్‌లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. వీటిని వినియోగించాలంటేనే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగిలిపోయిన సింక్, గడులు లేని తలుపులు, నీటి కనెక్షన్ లేని కమోడ్స్‌తో ఇబ్బందులకు గురవుతున్నారు. సరైన నిర్వహణ లేకపోవడంతో ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయని సిబ్బంది పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కొని సిబ్బంది పడుతున్న ఇబ్బందులు తొలగిస్తారని ఆశిస్తున్నారు.

శివారు మున్సిపాలిటీలను

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తా

● కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా శివారు మున్సిపాలిటీలను అభివృద్ధి పరుస్తున్నామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ 19వ వార్డులో దాదాపు కోటి రూపాయల సీఎస్ఆర్ నిధులు వెచ్చించి నూతనంగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి కోట్లాది రూపాయలు కేటాయించి అభివృద్ధి చేశామన్నారు. రాబోయే రోజుల్లో శివారు మున్సిపాలిటీలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పరుస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, బీఆర్ఎస్ కృష్ణ, వెంబడి బుచ్చిరెడ్డి, మురళీ యాదవ్, సింహపురి కాలనీ వాసులు దేవేందర్‌రెడ్డి, దశరత్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, మణివర్ధన్, రవీంద్ర, సందీప్‌రావు, శ్రీనివాసరావు. సత్యనారాయణరెడ్డి, రాము ఉన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

అప్రోచ్ రోడ్డు సమస్యను పరిష్కరిస్తా

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా బౌరంపేట డాలర్ మెడోస్ కాలనీ వాసుల వినతి మేరకు ఎమెల్యే కాలనీలో పర్యటించారు. అప్రోచ్‌రోడ్డు సమస్యపై హౌసింగ్ బోర్డు వారితో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. కాలనీలో వీధిదీపాలు, తాగునీరు, మౌలిక వసతులు కల్పిస్తామని వారికి హామీ ఇచ్చారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా : కొలన్

గాజులరామారం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్, ప్రకాశంపంతులు నగర్‌లో ఈ నెల 9న శ్రీ సంజీవ అంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపనకు హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


కొలన్ హన్మంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సమస్యల పరిష్కారానికి చర్యలు

● కూన శ్రీశైలంగౌడ్

షాపూర్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం నియోజకవర్గం పరిధిలోని పలువురు నాయకులు, పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వివిధ కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీ, వీధి దీపాలు, తదితర సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. ఈ వినతులు స్వీకరించిన ఆయన పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.


ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కాశీ విశ్వేశ్వర ఆలయ నూతన కమిటీ సభ్యుల ఎన్నిక

గాజులరామారం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్ రెడ్డినగర్‌లో కాశీ విశ్వేశ్వర ఆలయ నూతన కమిటీ సభ్యులను కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎన్ గోవర్ధన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా శివరామ్‌రెడ్డి, కోశాధికారిగా పి.రాము, గౌరవ సభ్యులుగా చంద్రశేఖర్‌శర్మ, మోహన్ బాలరాజు, సలహాదారుడుగా శ్రీనివాస్‌శర్మ పంతులు ఎన్నిక కాగా నూతన కమిటీ సభ్యులు గత ఆలయ కమిటీ అధ్యక్షులు మోహన్‌రావు చారి, జనరల్ సెక్రటరీ నాగేశ్వరరావు, కోశాధికారి సంజీవరావును ఘనంగా సన్మానించారు.


గత ఆలయ కమిటీ సభ్యులను సన్మానించిన నూతన ఆలయ కమిటీ సభ్యులు

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

నిజాంపేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే సీపీఎం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం పిలుపునిచ్చారు. ఆదివారం కూకట్‌పల్లి, బాలానగర్, కుత్బుల్లాపూర్, బాచుపల్లి, దుండిగల్, మేడ్చల్ మండలాల శాఖాకార్యదర్శుల సమావేశం ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం, కార్యవర్గ సభ్యులు కృష్ణారావు, ప్రగతినగర్ కార్పొరేటర్ వెంకట రామయ్య, శంకర్, రాజశేఖర్, లక్ష్మణ్, నరేష్, దుండిగల్ కార్యదర్శి లింగస్వామి ప్రసంగించారు. సీపీఎం ప్రజా పోరాటాలను నిరంతరం కొనసాగిస్తూ, సమస్యల పరిష్కారానికి గత మూడు సంవత్సరాల కాలంలో అనేక ఉద్యమాలు చేపట్టామన్నారు. ముఖ్యంగా డంపింగ్‌యార్డ్, కార్మికుల వేతనాలు, ఆశా, అంగన్‌వాడీ సమస్యలపై నిత్యం ఉద్యమాలు చేశామని తెలిపారు. అదే విధం గా అర్హులైన వారందరికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని, స్థానిక సమస్యలపై కూడా పోరాటాలు కొనసాగుతుంటాయన్నారు. ఈ సమావేశంలో మండలాల నాయకులు, కార్మికులు ఉన్నారు.



ప్రగతినగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సత్యం

ప్రజా సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్సీ

దుండిగల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు కాలనీలకు చెందిన ప్రజలు, సంక్షేమ సంఘాల సభ్యులు తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీని కలిసి విన్నవించుకున్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మల్లంపేట లోని అశోక్ సొసైటీ, మాన్విత బ్రిందా, డ్రీమ్ వ్యాలీ, ఎపీఆర్ సొసైటీ, గ్రీన్ పార్కు సొసైటీ, భవనాస్ సొసైటీలో రోడ్లు, డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్ రిపేర్లు, వీధి లైట్లు వంటి సమస్యలను పరిష్కరించాలని ఆయనకు విన్నవించారు.


సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన పలు కాలనీల సొసైటీ సభ్యులు

సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయండి

● ఎంపీ ఈటల రాజేందర్

జీడిమెట్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 10న జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో నిర్వహించే సదర్ మహోత్సవ కరపత్రాన్ని ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేకే.శేఖర్ యాదవ్ మాట్లాడుతూ యాదవ సోదరులు, అభిమానులు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమ్మయ్య యాదవ్, సత్యనారాయణ యాదవ్, జగదీష్ యాదవ్, రాజు యాదవ్, ఆంజనేయులు యాదవ్ పాల్గొన్నారు.


కరపత్రం విడుదల చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

సబ్‌స్టేషన్ దగ్గర చెత్తను తొలగించండి

జీడిమెట్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతంలోని ఎస్ శబ్రీ కోఆపరేటివ్ సొసైటీలో విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోయి ఉన్నా ఐలా అధికారులు, స్థానిక పారిశ్రామికవేత్తల సంఘం నాయకులు గానీ పట్టించుకోవడం లేదు. నెల వారి లక్షల రూపాయల్లో బిల్లులు తీసుకుంటున్న కాంట్రాక్టర్ పనులు సక్రమంగా నిర్వహించడంలేదు. ఫలితంగా ఇలాంటి దుర్భర పరిస్థితి నెలకొంది. టీఎస్ఐఐసీ ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్, ఐలా అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు.


సబ్‌స్టేషన్ వద్ద పేరుకుపోయిన చెత్త

అసమానతలు లేని సమాజ నిర్మాణమే డీవైఎఫ్ఐ ధ్యేయం

షాపూర్‌నగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అసమానతలు లేని సమాజ నిర్మాణమే డీవైఎఫ్ఐ లక్ష్యమని కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షుడు ఆది నాగరాజు అన్నారు. భారత ప్రజా యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ)44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా షాపూర్‌నగర్ కార్యాలయంలో ఆదివారం డీవైఎఫ్ఐ జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా నాగరాజు, మాజీ జిల్లా అధ్యక్షులు పశుల అంజయ్య మాట్లాడుతూ 1980 నవంబరు లుధియానా రాష్ట్రంలో డీవైఎఫ్ఐ ఆవిర్భవించిందన్నారు. మా దేహం ముక్కలైనా ఈ దేశాన్ని ముక్కలు కానివ్వం అనే నినాదంతో ఆ రోజు నుంచి ఈ రోజు వరకు దేశంలో ఉగ్రవాదానికి, మతోన్మాదానికి, ఏర్పాటువాదానికి దాదాపు నాలుగువేల మంది డీవైఎఫ్ఐ కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారన్నారు. దేశ సమైఖ్యత, సమగ్రతలను కాపాడటానికి విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాల, దేశంలో విపత్తులు సంభవించినప్పుడు బాధ్యత గల పైరునిగా డీవైఎఫ్ఐ కార్యకర్తలు సేవలు చేస్తున్నారన్నారు. భగత్‌సింగ్, చెగువేర స్ఫూర్తితో అవినీతిని పూర్తిగా నిర్మూలించాలని పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. యువతీ యువకులు ఈ పోరాటాలకు మద్దతు తెలిపి భగత్‌సింగ్ కలలు కన్న అసమానతలు లేని సమాజ నిర్మాణానికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు ఆర్.శ్రీనివాస్, డి కరుణాకర్, భాష, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.


డీవైఎఫ్ఐ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

రాంనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ పేర్కొన్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేస్తున్న ఓబీసీ ఉద్యోగులందరూ ఐక్యతను చాటి తమకు రావాల్సిన వాటాను సాధించుకోవాలని పేర్కొన్నారు. బీసీ జనాభా లెక్కలు తేల్చి రాజ్యాంగపరంగా రావాల్సిన వాటాను ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ఈనెల 6వ తేదీ నుంచి బీసీ జనాభా లెక్కల సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో బీసీలందరూ పాల్గొని తమ వివరాలను సర్వే బృందానికి తెలియజేయాలని సూచించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శంకర్, ఎం.మోహన్‌ల అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిరంజన్ మాట్లాడుతూ స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ గ్రామీణ ప్రాంతంలోని పేద ప్రజలకు బ్యాంకు రుణాలు అందజేయాలనే లక్ష్యంతో గ్రామీణ బ్యాంకులను ప్రారంభించారని తెలిపారు. గ్రామీణ బ్యాంకులు గ్రామాలలోని పేదలకు కావాల్సిన రుణాలను అందజేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు బ్యాంకు ఉద్యోగులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ శాఖలలో పని చేసే ఓబీసీ ఉద్యోగుల మనోభావాలను గుర్తిస్తూ వాటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఓబీసీ ఉద్యోగులపై ఉన్న క్రీమిలేయర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తగిన ప్రమోషన్లు వచ్చేలా పాటుపడతామన్నారు.

అనంతరం తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ వై.శోభ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు తమ బ్యాంకు సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. ఓబీసీ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి కె.శంకర్, ఎం.మోహన్‌లు మాట్లాడుతూ ఓబీసీ ఉద్యోగులకు న్యాయపరంగా రావాల్సిన ప్రమోషన్లు ఇతర బెనిఫిట్లు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ బ్యాంకులో రాష్ట్రవ్యాప్తంగా 900 మంది ఓబీసీ ఉద్యోగులు పని చేస్తున్నారని వారన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి నూతన కమిటీ ఎన్నికవుతుందన్నారు. ఈ సమావేశంలో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.కరుణానిధి, ఏఐఆర్ఆర్‌బీఈఏ సెక్రటరీ జనరల్ ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌బీఐ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రాజు, వివిధ సంఘాల నాయకులు యు.చిన్నయ్య, బి.రవికాంత్, వి.దానకర్ణచారి, పి.శ్రీనివాస్‌గౌడ్, వంశీకృష్ణ, లోకేష్, భిక్షమయ్య, శ్రీనివాస్‌యాదవ్, మధుసూదన్, శ్రీమన్నారాయణ, కె.అశోక్, విజయ్‌సింగ్, సత్యనారాయణ, ఎం.రంగారావు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సదస్సులో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

ఆలయ నిర్మాణానికి రూ. 5 లక్షలు విరాళం

నిజాంపేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ మధురానగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అష్టలక్ష్మి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణంలో అష్టలక్ష్మి విగ్రహాల నిమిత్తం కోనేరు శ్రీనివాసరావు రూ.5 లక్షలను విరాళంగా కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఆలయ నిర్మాణంలో దాతలు ముందుకువచ్చి వస్తు, ధన రూపేణా సహకరించి దేవాలయ నిర్మాణంలో పాలుపంచుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విష్ణువర్ధన్‌రావు, లింగయ్య, హేమంత్, రాంబాబు, మద్దయ్య, రామలక్ష్మారెడ్డి, హన్మంతరావు, బసవ రాజు, శ్రీనివాస్, శంకర్, ఎస్. శ్రీనివాస్, నాగేశ్వరరావు, మురళీ, సుధాకర్, అర్చకులు ఉన్నారు.


విరాళంగా రూ. 5 లక్షల చెక్కును అందజేస్తున్న కోనేరు శ్రీనివాసరావు

అప్పులబాధతో రైలు కింద పడి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తలకుమించిన అప్పుల బాధతో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట్ ప్రాంతానికి చెందిన పిట్ల వెంకటయ్య (52) ఏపీ పల్నాడు నుంచి రెండేళ్ల క్రితం బతుకుదెరువు కోసం శామీర్‌పేటకు వచ్చాడు. కూతురు పెళ్లి చేసి కొత్త ఇల్లు కొనడంతో స్థాయికి మించి అప్పులు కావడంతో తీవ్రమనస్థాపానికి గురయ్యాడు. శనివారం ఊరు వెళుతున్నానని కుటుంబ సభ్యులతో చెప్పి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 1వ ప్లాట్ ఫాంపైకి చేరుకున్నాడు.

ఆ సమయంలో సికింద్రాబాద్‌కు వస్తున్న దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాంపైకి వస్తుండగా పిట్ల వెంకటయ్య ఒక్కసారిగా దిగిపోయి రైలు పట్టాలు దాటి దానాపూర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు మార్చురీకి తరలించారు. మృతుడి జేబులో దొరికిన అడ్రస్ ప్రకారం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.